క్లుప్తంగా

పవన సుతుడికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న పర్వతాంజనేయ స్వామి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు వివేకానంద కాలనీలోని పర్వతాంజనేయ స్వామి ఆలయంలో, ప్రసన్నగిరిపై దాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. తమలపాకులు, సిందూరంతో అర్చించారు. షీలానగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో తమలపాకులతో అర్చించి, నిమ్మకాయలు, వడమాల దండలతో అలంకరించారు. అధిక సంఖ్యలో క్తులు స్వామిని దర్శించుకున్నారు.

చెత్తకు నిప్పు.. ఎగసిన మంటలు


మంటలు చెలరేగుతున్న దృశ్యం

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు ప్రధాన గెడ్డ వద్ద మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. దట్టమైన పొగ గ్రామాన్ని ఆవరించడంతో ఏం జరిగిందోనని జనం ఆందోళన చెందారు. సంఘటన స్థలం వద్దకు పరుగులు తీశారు. అయితే గెడ్డ పక్కన ఉన్న చెత్తకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వచ్చాయని తెలుసుకుని, వెంటనే పెదగంట్యాడ అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారం అందజేశారు. స్పందించిన వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

భక్తిశ్రద్ధలతో హోమం


స్వామి వారి ఆలయ ప్రాంగణంలో హోమంలో పాల్గొన్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలోని వైకుంఠ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయంలో మంగళవారం విశేష పూజలు చేశారు. ముందుగా 108 కలశాలతో స్వామి వారికి అభిషేకాలు చేసిన అనంతరం ప్రత్యేక హోమాలు చేశారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు రమణానంద స్వామిజీ చేతుల మీదుగా ఈ పూజలు జరిగాయి. కార్యక్రమంలో దొడ్డి రమణ, మంత్రి మంజుల, విల్లూరి శ్రీనివాసరావు, అప్పలరెడ్డి, పెంటకోట వెంకట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్మయానంద జయంతి



చిన్మయానంద పాదుకా పూజ చేస్తున్న భక్తులు

ఉక్కునగరం: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చిన్మయానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్మయానంద 108వ జయంతి సందర్భంగా చిన్మయ మిషన్ ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో 'చిన్మయ శంకరం' పేరిట ఈ వేడుకలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 8.30 వరకు కూర్మన్నపాలెం అన్నపూర్ణ థియేటర్ సమీప శ్రీకృష్ణ ఈడెన్ ఫంక్షన్ హాల్లో పాదుకా పూజ నిర్వహించారు. మహిళలచే భజనలు, కోలాటం జరిగాయి. బాలలు భరత నాట్య ప్రదర్శనతో తమ ప్రావీణ్యత చాటారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలింగ్ @ 69.83%

- గతంలో కంటే పెరిగిన ఓటింగ్
- నియోజకవర్గం ఏర్పడ్డాక ఇదే అధికం


ఓటు వేసేందుకు గాజువాక హైస్కూల్ వద్ద క్యూలో నిరీక్షిస్తున్న ఓటర్లు



స్ఫూర్తి : వయసు పైబడినా, ఆరోగ్యం సహకరించకున్నా, ఓటుహక్కును వినియోగించుకునేందుకు వచ్చిన వృద్ధులు


గాజువాక ప్రాథమిక పాఠశాలలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

గాజువాక: ఓటర్లలో చైతన్యం పెరిగింది. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికమంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. 2009లో నియోజకవర్గం ఏర్పడిన సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో నమోదైనదే ఇప్పటివరకు అత్యధికశాతం పోలింగ్. దానిని మించి ఈ సారి పోల్ కావడంతో రాజకీయవర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. సోమవారం నిర్వహించిన పోలింగ్‌లో 69.83 శాతం ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,33,611 మంది కాగా, 2,32,949 మంది ఓట్లు వేశారు. వారిలో పురుషులు 1,14,844 మంది కాగా, మహిళా ఓటర్లు 1,18,105 మంది. 2009లో 68 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ సారి 1.83 శాతం అధికంగా నమోదైంది.

మొదటి రెండు గంటల్లో అత్యధికంగా..

- ఈ ఎన్నికల్లో పోలింగ్ సరళిపై కూడా అటు అధికారులు, ఇటు రాజకీయవర్గాలు సంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ మొదలైన తరువాత మొదటి రెండు గంటల్లో ఓటర్లు అత్యధిక సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు 17.23 శాతం, 11 గంటలకు 21.65 శాతం, ఒంటి గంటకు 38.02 శాతం, మూడు గంటలకు 45.85 శాతం నమోదు కాగా, సాయంత్రం ఐదు గంటలకు 58.23 శాతం నమోదైంది. పోలింగ్ ముగిసే సమయానికి సుమారు 69.83 శాతం నమోదనైట్లు ఎన్నికల రిటర్నింగు అధికారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఎండల తీవ్రత కారణంగా ఉదయం 11 నుంచి 3 గంటల మధ్యలో పోలింగ్ మందగించినప్పటికీ అంతకుముందు, ఆ తరువాత ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలవద్ద క్యూ కట్టారు.

ఇదీ ఓటింగ్ తీరు

- 2009లో నియోజకవర్గం ఏర్పడి ఎన్నికలు నిర్వహించే సమయానికి గాజువాకలో ఓటర్ల సంఖ్య 2,20,739 మంది. వారిలో 1,50,102 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 68 శాతం పోలింగ్ నమోదైంది.
- 2014లో రెండోసారి జరిగిన ఎన్నికల సమయానికి గాజువాక ఓటర్లు 2,89,939 మంది. అప్పట్లో 64.64 శాతం నమోదైన ఓటింగ్‌లో 1,85,917 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2009తో పోల్చితే రెండోసారి జరిగిన ఎన్నికలనాటికి 69వేల మంది ఓటర్లు పెరిగారు. ఓటర్లు పెరిగినప్పటికీ ఓటింగ్ శాతం తగ్గిపోయింది.
- 2019లో జరిగిన ఎన్నికల్లో గాజువాక ఓటర్ల సంఖ్య 3,09,326 మంది. అంతకుముందు ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో 19,387 మంది ఓటర్లు పెరిగారు. ఓటర్లలో 2,02,094 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. 65.33 శాతం నమోదైన ఓటింగ్‌లో 1,01,772 మంది పురుషులు, 1,00,320 మంది మహిళలు ఓట్లు వేశారు.
- ప్రస్తుత ఎన్నికల్లో నియోజకవర్గం ఓటర్ల సంఖ్య 3,33,611 మంది. పురుషులు 1,67,112 మంది కాగా, మహిళలు 1,66,487 మంది. థర్డ్ జెండర్ ఓటర్లు 12 మంది. 69.83 శాతం ఓటింగ్ నమోదైన ఈ ఎన్నికల్లోను 2,32,949 మంది ఓట్లు వేశారు.

ఓటెత్తిన మహిళా లోకం


అక్కిరెడ్డిపాలెం హైస్కూల్లో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు

- గాజువాకలో మహిళా ఓటింగే అధికం
- వారి తీర్పే కీలకం

గాజువాక: గాజువాక నియోజకవర్గంలో మహిళా ఓటింగ్ అత్యధికంగా పోలైంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి భారీ సంఖ్యలో మహిళా ఓటింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,33,611 మంది కాగా, 2,32,949 మంది ఓట్లు వేశారు. వారిలో పురుషులు 1,14,844 మంది కాగా, మహిళా ఓటర్లు 1,18,105 మంది. పురుషుల కంటే మహిళలు 3261 మంది అధికంగా ఓట్లు వేశారు. పోలైన ఓట్లలో సగానికంటే పైగా మహిళలే కావడం గమనార్హం.

మహిళా ఓట్లు ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపులో కీలకంగా మారనున్నాయి. ముందెన్నడు లేని విధంగా గాజువాకలో మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం తమకు లాభిస్తుందా, ప్రత్యర్థులకు ఉపయోగపడుతుందా అనే కోణంలో అభ్యర్థులు ఆలోచిస్తున్నారు. గత ఎన్నికలతో పోల్చితే ఈసారి ఓటింగ్ శాతం కూడా పెరిగింది. అందులోను మహిళల ఓటింగ్ మరింత పెరిగింది. పురుషుల కంటే అధిక సంఖ్యలో మహిళా ఓటు పోలవడం ఎవరికి మేలు అన్న విషయంలో అభ్యర్థులు పలు విధాలుగా ఆలోచిస్తున్నారు.

14 మంది అభ్యర్థులు బరిలో ఉన్న గాజువాక నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్య పోటీ హోరాహోరీగా ఉన్న విషయం తెలిసిందే. దీంతో మహిళా ఓట్లు ఈ రెండు పార్టీల అభ్యర్థుల్లో ఎవరిని వరించనున్నాయోనన్న లెక్కలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలో సంక్షేమ పథకాల రూపంలో మహిళలను అగ్రస్థానంలో నిలబెట్టిన విషయం తెలిసిందే. మహిళలు తమ పిల్లలను చదివిస్తే నేరుగా వారి బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు డిపాజిట్ చేశారు. డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చేశారు. పేద, మధ్య తరగతి ప్రజల బతుకులు బాగుపడటం కోసం అమలు చేసిన సంక్షేమ పథకాల్లో మహిళలకే ప్రాధాన్యం కల్పించారు. ఇళ్ల స్థలాలు, ఇళ్లు మహిళల పేరుమీదే ఇచ్చారు. ఒక్క గాజువాక నియోజకవర్గంలోనే 25 వేల మందికి ఇళ్ల స్థలాలను అందజేశారు. ఈ పథకాలు మహిళలను బాగా ఆకర్షించాయని పరిశీలకులు భావిస్తున్నారు. టీడీపీ అధ్యక్షుడు కూడా కొన్ని పథకాలను ప్రకటించినప్పటికీ అవి ఆకర్షించకపోవడం, గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోవడమే గాక, గతంలో హక్కులు అడిగిన మహిళలపై దాడి చేయించడంతో వారు ఆ పార్టీకి దూరంగా ఉన్నారనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. అయినప్పటికీ టీడీపీ అభ్యర్థి మహిళా ఓట్లు తమకు కూడా అనుకూలంగా వస్తాయనే ఆశతో ఉన్నారు. ఈ నేపథ్యంలో గాజువాకలో చర్చోపచర్చలు జోరుగా సాగుతున్నాయి. అభ్యర్థుల భవితవ్యం మాత్రం ఈవీఎంలలో భద్రంగా నిక్షిప్తమై ఉంది.

ఓటింగ్‌కు లక్ష మంది దూరం



గాజువాక: పారిశ్రామిక ముఖద్వారంగా ఉన్న గాజువాక నియోజకవర్గంలో ఈసారి పోలింగ్ శాతం పట్ల అటు రాజకీయపక్షాలు, ఇటు పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే, ప్రతీసారి ఎన్నికల్లో లక్షమందికి పైగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోకపోవడం మాత్రం చర్చనీయాంశమవుతోంది. ఉపాధి కోసం వలస వచ్చిన కుటుంబాలు సాధారణ ఎన్నికల సమయంలో తమ సొంతూళ్లకు వెళ్లిపోతున్నాయా, లేనిపక్షంలో ఓటింగ్‌లో పాల్గొనడం ఇష్టం లేదా వంటి ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

2009లో ఏర్పడిన గాజువాక నియోజకవర్గంలో మొదటిసారి జరిగిన ఎన్నికల్లో 68 శాతం ఓట్లు పోలవగా, 2014లో రెండోసారి జరిగిన ఎన్నికల్లో 64.64 శాతం, 2019లో జరిగిన ఎన్నికల్లో 65.33 శాతం, 2024లో జరిగిన ఎన్నికల్లో 69.83 శాతం ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో జరిగిన అన్ని ఎన్నికల్లోను భారీ సంఖ్యలోనే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోని పరిస్థితి కనిపిస్తోంది. 3,33,611 మంది ఓటర్లున్న గాజువాకలో 1,00,662 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఇంతపెద్ద సంఖ్యలో ఓటర్లు ఓటు వేయకపోవడం ప్రజాస్వామ్యవాదులను కలవరపరుస్తోంది. ఓటు రాకపోతే సంబంధిత సిబ్బందిపై శివాలెత్తిపోతున్న దరఖాస్తుదారులు ఓటు వచ్చిన తరువాత దాన్ని వినియోగించుకోవడంపై శ్రద్ధ చూపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2019 ఎన్నికల నాటికి గాజువాక ఓటర్ల సంఖ్య 3,09,326 మంది కాగా, ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 3,33,611 మంది. గత ఎన్నికలకంటే ఈసారి 24,285 మంది పెరిగారు. ఓటింగ్ శాతం కూడా గత ఎన్నికల కంటే ఈసారి మెరుగు పడింది. అయినా ఓటును వినియోగించుకోని ఓటర్లే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఈ పరిస్థితి రాజకీయ పరిశీలకులను విస్మయానికి గురిచేస్తోంది.

ఇదీ తీరు

- 2009 ఎన్నికల్లో మొత్తం ఓటర్ల సంఖ్య 2,20,739 కాగా 70,673 మంది ఓటు హక్కును ఉపయోగించుకోలేదు.
- 2014 ఎన్నికల్లో గాజువాక ఓటర్లు 2,89,939 మంది కాగా, 1,02,513 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోలేదు.
- 2019లో జరిగిన ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య 3,09,326 మంది కాగా 1,07,232 మంది ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉన్నారు.
- ప్రస్తుత ఎన్నికల్లో నియోజకవర్గం ఓటర్ల సంఖ్య 3,33,611 మంది. ఈ ఎన్నికల్లో 1,00,662 మంది ఓటింగ్‌లో పాల్గొనలేదు.

ఎందుకిలా?

లక్ష మందికి పైగా ఓటింగ్‌కు దూరమైపోతుండటంపై పరిశీలకులు వివిధ రకాలుగా విశ్లేషిస్తున్నారు. పారిశ్రామిక కేంద్రంగా ఉన్న గాజువాకకు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలనుంచి కూడా వలస వచ్చి నివాసముంటున్నవారు కూడా అధికంగానే ఉన్నారు. అయినప్పటికీ వారి మూలాలు తమ సొంత ప్రాంతాల్లోనే ఉండటంతో ఇలాంటి సందర్భాలు వచ్చినప్పుడు అక్కడికి వెళ్లిపోతున్నట్టుగా పేర్కొంటున్నారు. ఈ విధంగా ఈసారి కూడా గాజువాక ప్రాంతం నుంచి సుమారు 30 శాతం మంది ఓటర్లు తమ సొంత గ్రామాలకు వెళ్లిపోయినట్టుగా భావిస్తున్నారు. ప్రస్తుత ఎన్నికలు పలు పార్టీలకు ప్రతిష్ఠాత్మకం కావడంతో ఆయా ప్రాంతాల్లోని అభ్యర్థులు ఎక్కడెక్కడ ఉన్నా తమ గ్రామస్తులను, పరిచయస్తులను కూడా తమకు ఓటు వేసేందుకు పిలిపించుకున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే గాజువాకలో లక్ష మంది ఓటర్లు ఇక్కడ ఓటింగ్‌లో పాల్గొనడంలేదని అభిప్రాయపడుతున్నారు. వలస కుటుంబాలకు ఇక్కడ, తమ గ్రామంలో కూడా ఓటు ఉండటంతో ఎన్నికల సమయంలో తమ స్వగ్రామాల్లో అభ్యర్థులకే ప్రాధాన్యం ఇస్తున్నారని అంటున్నారు.

పనిచేయని కోచ్ ఇండికేటర్లు

ప్రయాణికుల అవస్థలు


దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై పనిచేయని కోచ్ ఇండికేటర్లు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై తరచూ కోచ్ ఇండికేటర్లు పనిచేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారు ఎక్కాల్సిన కోచ్ ఎక్కడికి వచ్చి ఆగుతుందో తెలియక లగేజీలు, వృద్ధులు, పిల్లలతో పరుగులు తీయాల్సి వస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. సోమవారం ఉదయం నుంచి ఇదే పరిస్థితి ఉండడంతో నిర్వహణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్య పునరావృతం కాకుండా చూడాలని దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అధికారులను కోరారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో యాపిల్ ఐ విద్యార్థుల ప్రతిభ


శౌర్య యాదవ్, 12వ తరగతి


శౌర్య వర్ధన్ చౌహాన్, పదో తరగతి

గాజువాక: సీబీఎస్ఈ 12వ తరగతి, పదో తరగతి ఫలితాల్లో స్థానిక యాపిల్ ఐ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 12వ తరగతిలో శౌర్య యాదవ్ 473 మార్కులతో, పదో తరగతిలో శౌర్య వర్ధన్ చౌహాన్ 473 మార్కులతో స్కూల్ టాపర్లుగా నిలిచినట్టు చైర్మన్ టి.బలరామకృష్ణ తెలిపారు. 10 మంది విద్యార్థులు 90 శాతం పైగా మార్కులు సాధించారని, 71 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులను, పాఠశాల ప్రిన్సిపాల్ పమీలా ముఖర్జీ తదితరులను అభినందించారు.

తాటిముంజెలకు భలే గిరాకీ


బీసీ రోడ్డులో విక్రయిస్తున్న తాటిముంజెలు

పెదగంట్యాడ: వేసవి తాపం నుంచి ఉపశమనాన్ని ఇచ్చే తాటి ముంజెల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మండలంలోని పెదగంట్యాడ జంక్షన్‌తో పాటు బీసీ రోడ్డులోని వికాస్‌నగర్ జంక్షన్, చైతన్య కళాశాల సమీపంలో రోజూ ఉదయం 11 గంటల తర్వాత తాటికాయలు తీసుకువచ్చి.. అక్కడే వాటిలోని ముంజెలను తీసి తాజాగా విక్రయిస్తున్నారు. డజను రూ.50 నుంచి రూ.60 వరకు అమ్ముతున్నారు. అలాగే ఒక్కో కాయ రూ.10 వంతున విక్రయిస్తున్నారు. తాటి కాయలతో పాటు ముంజెలకు గిరాకీ ఏర్పడడంతో విజయనగరం జిల్లాలోని శృంగవరపు కోట, లక్కవరపు కోటకు చెందిన వారు ఏటా వేసవిలో ఇక్కడకు వచ్చి తాటిచెట్ల నుంచి వీటిని సేకరించి, విక్రయిస్తున్నారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో విద్యార్థిని ప్రతిభ


లోహిత (31వ ర్యాంక్)

అగనంపూడి: ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో కూర్మన్నపాలెం శ్రీరామకృష్ణ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలకు చెందిన కె.లోహిత ఉత్తమ ప్రతిభ కనబరిచి, 31వ ర్యాంక్‌తో నిలిచింది. లోహిత పదో తరగతి ఫలితాల్లో 596 మార్కులతో టాపర్‌గా నిలవడంతో పాటు ఏపీఆర్‌జేసీ ఫలితాల్లోనూ మంచి ర్యాంక్ సాధించడంపై ఆమె తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి తండ్రి స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా చేస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ పొన్నాడ వాసు, డైరెక్టర్ లలిత కుమారి అభినందించారు. వారు మాట్లాడుతూ తమ పాఠశాలలో జి.ప్రభు కిషోర్ (205వ ర్యాంక్), ఎ.ప్రమీల (280వ ర్యాంక్) మంచి ఫలితాలు సాధించినట్టు పేర్కొన్నారు.

ప్రజా మద్దతుతో ప్లాంటును రక్షించుకుంటాం

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 1188వ రోజుకు రిలే దీక్షలు


మాట్లాడుతున్న ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు

అగనంపూడి: విశాఖ ఉక్కును ప్రైవేటు సంస్థకు అప్పగించడానికి తలో చేయి వేసి సహకారం అందిస్తున్నారని, అదే నేడు ఈ దుస్థితికి కారణమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, డి.ఆదినారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజా మద్దతుతో ప్లాంటును పరిరక్షించుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1188వ రోజు శిబిరంలో వారు మాట్లాడారు. గంగవరం పోర్టు యాజమాన్యం సృష్టిస్తున్న అవరోధాలు, అడ్డంకులు ప్రజల సహకారంతో ఎప్పటికైనా తొలగిపోతాయన్నారు. కుట్రలెన్ని చేసినా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించలేరన్నారు. ప్రజలు తలచుకుంటే పాలకులే కాదు, ఏ పారిశ్రామికవేత్తలు, తొత్తులు నిలబడలేరన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని, ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వి.రామ్మోహనకుమార్, డి.శ్రీనివాస్, జి.నరేంద్ర, శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

అగనంపూడిలో కేఏ పాల్ చిట్‌చాట్


అగనంపూడి జాతీయ రహదారి కూడలి వద్ద మంచినీరు తీసుకుంటున్న పాల్

అగనంపూడి: కారులో అనకాపల్లి వైపు వెళ్తున్న ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ పాత అగనంపూడి కూడలి వద్ద ఆగి, స్థానికులతో కాసేపు మాట్లాడారు. మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రం వద్ద కారును నిలిపి మంచినీరు అడిగి తీసుకున్నారు. తరువాత సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, నాయకురాలు నెల్లి తులసితో మాట్లాడి, అగనంపూడిలో ఎన్నికల ప్రభావం ఎలా ఉందని ఆరా తీశారు.

కల్యాణం.. కమనీయం


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ. 1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు తెలిపారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మర్లమాంబ పండగ


పూజలందుకున్న మర్లమాంబ

సబ్బవరం: మండలంలోని పెదనాయుడు పాలెంలో కొలువైన మర్లమాంబ పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల నడుమ రాత్రికి అమ్మవారి అనుపు మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.